ప్రజాపాలన విజయోత్సవాలు



డబీల్‌పూర్‌లో కళాకారుల ప్రదర్శన

మేడ్చల్: రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలలో కళాయాత్ర నిర్వహించారు. కళాకారులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రజాపాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. మండలంలోని కోనాయిపల్లి, డబీల్‌పూర్, ఎల్లంపేట్ తదితర గ్రామాల్లో కళాయాత్ర నిర్వహించారు.

పశు దాణా పంపిణీ



ఎదులాబాద్‌లో మాట్లాడుతున్న జిల్లా అధికారి సుధాకర్

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని పశువైద్యశాలలో గురువారం ఎస్సీలకు పశుదాణా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా పశువైద్యాధికారి సుధాకర్ హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి గేదెలకు పౌష్టికాహారం అందించి పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి పాలదిగుబడిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహ్మా, రామకృష్ణ శ్రీనాథ్, మండల పశువైద్యాధికారి పద్మిని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సత్కారం



జవహర్‌నగర్: మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్‌ను గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన బాలాజీనగర్ శ్రీమల్లన్న యాదవ సంఘం నాయకులు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ యాదవ్, అశోక్, రామకృష్ణ, కృష్ణయాదవ్, మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శామీర్‌పేట్: ప్రజా అవసరాలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. శామీర్‌పేట్‌లో వైఎస్‌ఆర్ చౌరస్తాలో సర్వీస్‌రోడ్డు ఏర్పాటు, గ్రామంలోని రోడ్లు ఇతర సమస్యలపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో గురువారం కమిషనర్ పర్యటించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించాడు. సర్వీస్ రోడ్డు ఏర్పాటుతోనే ట్రాఫిక్ సమస్య తొలుగుతుందని, అందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంతు నియంత్రణ కేంద్రం పరిశీలన



పోచారం: నారపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జంతు నియంత్రణ కేంద్రాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ నిధుల నుంచి రూ. 32 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 15 లక్షలు కేటాయించి జంతు నియంత్రణ కేంద్రాన్ని సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, మేనేజర్ అంజన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, వెటర్నరీ డాక్టర్ సుష్మా, నాయకులు శ్రీనివాస్, సూపర్‌వైజర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవి ముదిరాజ్

శామీర్‌పేట్: మండలంలోని తుర్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. గ్రామ దివంగత మాజీ ఎంపీటీసీ దాసరి ముత్యాలు కుమారుడు రవి ముదిరాజ్ రూ.20 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను 60 మంది 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రత్యేక తరగతుల సందర్భంగా స్నాక్స్ కొరకు రూ. 10 వేలు అందజేశారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మారెడ్డి, అప్సర్, రవిందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సునిత (ఫైల్)

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికి వెళ్తున్నానని బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని పటేల్‌నగర్ చెందిన సునిత (35) ఈ నెల 21న గురుకుల్ కాలేజ్ వద్ద గల బంధువుల ఇంటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. సునీత ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త కృష్ణ బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కల వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి



గుండ్లపోచంపల్లిలో నివాళులర్పిస్తున్న కౌన్సిలర్, నాయకులు



కండ్లకోయలో నివాళులర్పిస్తున్న నాయకులు

మేడ్చల్‌రూరల్:

మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లిలో కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, బీజేపీ నాయకులు, కండ్లకోయలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, భిక్షపతి, వెంకటేష్, నాగరాజు, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా మేడ్చల్, మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాలలో రాజకీయ పార్టీల నేతలు వివిధ ప్రజాసంఘాల నాయకులు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడ్చల్ చెక్‌పోస్ట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులతో పాటు, కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీల నాయకులు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కీసరలో..

మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా నాగారంలో ఉన్న ఎలక్ట్రికల్ డివిజన్ ఆఫీసులో బీసీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముత్యం వెంకన్నగూడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కీసర డీఈ లింగయ్య, మల్లేష్, దయానంద్, మురళీ, ఇతర ఎలక్ట్రికల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు



నాగారంలో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇన్ఫోసిస్ హాస్టల్స్, సెరీన్ హిల్స్, పోచారం, శివాలయ పరిసర ప్రాంతాలు, అన్నానగర్, నాగారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తదితర ప్రాంతాలకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

మేడ్చల్‌రూరల్‌లో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. 11కేవీ కండ్లకోయ ఫీడర్ పరిధిలో పనుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుబ్బా కోల్డ్ స్టోరేజ్, సుతారిగూడ గ్రామం, భారత్ పెట్రోల్ పంపు, పలు గోదాంలు, రైల్వే ట్రాక్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

జవహర్‌నగర్‌లో..

విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు. 33/11 కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాలాజీనగర్ ప్రధాన రహదారి, సంతోష్‌నగర్, శివాజీనగర్, శ్రీరామ్‌నగర్, మార్వాడీలైన్, జ్యోతి కాలనీ, భజరంగ్‌నగర్, వీకే.ఎన్‌క్లేవ్, మోహన్‌రావు కాలనీ, మార్కెట్ రోడ్డు, శాంతినగర్, ముత్తుస్వామి కాలనీ, వెంకటేశ్వరకాలనీ, బీజేఆర్‌నగర్, చెన్నాపురం, భగత్‌సింగ్ కాలనీ, ఆర్మీ డెంటల్ కాలేజీ, లక్ష్మీనర్సింహ కాలనీ, వికలాంగుల కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, అదేవిధంగా 33/11కేవీ సీఆర్‌పీఎఫ్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఆర్‌పీఎఫ్, అరుంధతినగర్, మల్లెలగూడ, ఫరానగర్, మల్కారం, గోశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నగదు బదిలీలో మోసం

పోచారం: నగదు బదిలీ చేయడం ద్వారా రూ. 79 వేల నష్టపోయిన ఓ బాధితుడు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు గ్రామానికి చెందిన దాసరి సాయి జగదీష్ పోచారంలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో ఉంటున్నాడు. ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా ఫోన్ కొనుగోలు చేసేందుకు కిరణ్ అనే వ్యక్తికి రూ. 79 వేలు నగదు బదిలీ చేశాడు. కానీ, నగదు తనకు అందలేదని చెప్పడంతో మోసపోయినట్లు తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత

మేడ్చల్: గౌడవెల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 341లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడౌన్‌లు నిర్మించే యత్నం చేస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఆలయ ఆవరణలో బహిరంగ వేలం

ఘట్‌కేసర్: పట్టణంలోని శ్రీ గట్టుమైసమ్మ ఆలయం ఆవరణలో డిసెంబర్ 2న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ భాగ్యలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 01, 2025 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు ఆలయం వద్ద కొబ్బరి కాయలు, పూజా సామాగ్రి విక్రయించడానికి ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో పాల్గొనడానికి ముందుగా రూ. 10 వేలు ధరావత్తు చెల్లించాలని, వేలం ముగిసిన వెంటనే సగం డబ్బు, రెండు రోజులలోపు మిగతా డబ్బు చెల్లించాలన్నారు.

చురుగ్గా బీజేపీ క్రియాశీలక సభ్యత్వం



సభ్యత్వం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ నిర్వహిస్తున్న క్రియాశీలక సభ్యత్వం మేడ్చల్ మున్సిపాలిటీలో చురుకుగా సాగుతోంది. పట్టణ నాయకులు, నాయకుల ఇళ్లకు వెళ్లి క్రియాశీలక సభ్యత్వాను అందజేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీవంజరి, ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయం



మేడిపల్లి పర్వతాపూర్ సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి నుండి పర్వతాపూర్ ప్రదాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ అమర్ సింగ్, 2వ వార్డు కార్పొరేటర్ సభాష్ నాయక్, 15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవిందర్ ముఖ్యఅతిదిగా పాల్గొని రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నిత్యం అత్యంత రద్దీగా ఉండే మేడిపల్లి పర్వతాపూర్ ప్రధాన రహదారి గుంతల మయమై పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా సీసీ రోడ్డును పనులను ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీంరెడ్డి నవీన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బండారి రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ స్థానిక నేతలతో కలిసి గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని వినతిపత్రాన్ని అందజేస్తున్నారు. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా చౌరస్తాలో పాదచారులకు ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా రోడ్డును వెడల్పు చేయాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవెంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. రూ.3,77,410 ఆదాయం కానుకల రూపంలో వచ్చిందని దేవస్థానం ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ప్రధాన అర్చకుడు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, క్లర్క్ సుధాకర్, రాందాస్ సంతోష్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఎమ్మెల్యే పర్యటన

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో బోహ్రా కమ్యూనిటీకి చెందిన శ్మశానవాటిక, ఎంఎస్‌డీ స్కూల్ వద్ద గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించారు. బోహ్రా శ్మశానవాటిక, స్కూల్, కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పెద్ద కమేళాను ఆనుకొని ఉందన్నారు. ఈ ప్రాంతంలోని 134 ఇళ్లకు సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థ బోహ్రా శ్మశానవాటికకు, స్కూల్ కింద నుంచి వెళ్తోందన్నారు. దీంతో సమస్య తలెత్తిందన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని త్వరలోనే సమస్యకు పరష్కారం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభ విజయవంతం చేయాలి

అల్వాల్: సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మల్కాజిగిరి మాల సంఘం నాయకులు తెలిపారు. గురువారం మహాభోది ఫంక్షన్‌హాల్‌లో మాలల సింహగర్జన సభ వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు ఎస్ఆర్.ప్రసాద్, చంద్రశేఖర్, ఇందిరాప్రయదర్శిని, శంకర్, నాగరాజు, రాఘవన్, కృష్ణమూర్తి, సుధాకర్, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి రైల్వే అండర్ పాస్ ఏర్పాటుకు గురువారం రైల్వే అధికారులు స్థల పరిశీలన చేశారు. గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గుండ్లపోచంపల్లి నుంచి కేవీరెడ్డి నగర్ వైపు వెళ్లేందుకు అండర్ పాస్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతులు అందజేశారు. ఇటీవల కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఈటల రైల్వే పనులపై చర్చించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం రైల్వే అధికారులు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి అండర్ పాస్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. రైల్వే డీఈఎన్ ముత్యాలు నాయుడు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఐఓబి విద్యాసాగర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యతో జ్ఞానం లభిస్తుంది



ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న కామినేని వైద్యకళాశాల ప్రొఫెసర్ రవిశంకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రస్తుత పోటి ప్రపంచంలో విద్య ఎంతో ముఖ్యమని, విద్య జ్ఞానంతో పాటు వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడుతుందని కామినేని వైద్యకళాశాల ప్రొఫెసర్ రవిశంకర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ, ఎంఫార్మసీ 2024-25 మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు గుర్తించి ఆవిష్కరించడంలోనే విద్యార్థుల విజయం ఆధారపడి ఉంటుందన్నారు. పేదలకు తక్కువ వ్యయంతో మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఫార్మసీ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు

అక్రమ నిర్మాణాలను అదుపు చేయడంలో

అధికారులు విఫలం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను అదుపుచేయడంలో మున్సిపల్ అధికారులు, టీపీఓ సెక్షన్ అధికారులు పూర్తిగా విఫలమౌతున్నారని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దుందిగల్ల దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ పరిధిలో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని యుఎల్‌సి మరియు ఆర్ఆర్‌యాక్ట్ క్రింద ఉన్న భూముల్లో భవన నిర్మాణాలకు నిబంధనలు అతిక్రమించి అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలకు ఆనుకొని ఉన్న పట్టా సర్వేనెంబర్లు తారుమారు చేసి అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్న వాటికి సైతం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు అన్ని సాక్ష్యాలు, ఆధారాలతో కూడిన పత్రాలతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై జిల్లాకలెక్టరేట్ కార్యాలయం, సీడీఎంఏ, విజిలెన్స్, ఏసీబీ వంటి కార్యాలయాల్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమనిర్మాణాలు, అక్రమ అనుమతులకు సంబంధించి జిల్లా కలెక్టర్, మున్సిపల్‌శాఖ అధికారులు విచారణ చేపట్టాలన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రంగారెడ్డినగర్: గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఐడీపీఎల్ చౌరస్తాలో విద్యార్థులు పెద్ద ఎత్తున చౌరస్తాలో బైఠాయించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామైంది. పోలీసులు రంగప్రవేశం చేసి నాయకులను స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో 48 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు బయటి జంక్ ఫుడ్ తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారని మంత్రి కొండా సురేఖ పేర్కొనడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా గురుకుల్లాలో నాణ్యమైన ఆహారం అందించకుంటే మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా కన్వీనర్ రేగోడ్ నగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ, నాగేంద్ర, వివేక్, డేవిడ్ పాల్గొన్నారు.

మాలలపై అసత్య ప్రచారాలు మానుకోవాలి





కీసరకు చేరుకున్న మాలల మహాపాదయాత్రలో పిల్లి సుధాకర్ తదితరులు

కీసర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ అంశాన్ని తీసుకురావద్దని, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లిసుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహాపాదయాత్ర అక్టోబర్ 25 భద్రాచలంలో ప్రారంభమై మేడ్చల్‌జిల్లాలో గురువారం కీసర మండలానికి చేరుకుంది. మాల మహానాడు జిల్లా కన్వీనర్ పరశరాం ఆధ్వర్యంలో మహాపాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కీసర చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పేరెడ్ గ్రౌండ్‌లో చేపడుతున్న మాలల మహా సంగ్రామ సభకు రాష్ట్ర వ్యాప్తంగా మాలలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, అర్జున్, వేణుగోపాల్, చంద్రయ్య, నాగరాజు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: భద్రాచలంలో ఈ నెల 25న ప్రారంభమైన జాతీయ మాల మహా పాదయాత్ర గురువారం ఘట్‌కేసర్‌కు చేరుకుంది. జాతీయ మాల మహానాడు మున్సిపల్ అధ్యక్షుడు రఘు మహా పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి నరేష్, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దళితులను విభజించాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో పాదయాత్ర ముగుస్తుందని, ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మాల ఉద్యోగులు, మేధావులు, విద్యార్థి, యువత, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికాంత్, జిల్లా కన్వీనర్ పరశురాం, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్ పద్మారావు, మల్లేష్, మురళీమోహన్, దాసు, ఆనంద్, అశోక్, రాజశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.